క్లుప్తంగా

జక్కంపూడి రాజా హౌస్ అరెస్టు హేయమైన చర్య

యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేరుగ చంద్‌నాగ్



బాపట్ల: రాజమండ్రి పేపర్ మిల్లు కార్మికుల సమస్యలపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా చేపట్టిన నిరసన దీక్షను భగ్నం చేసి హౌస్ అరెస్టు చేయటం హేయమైన చర్య అని రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేరుగ చంద్‌నాగ్ మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. పేపరు మిల్లు కార్మికులకు అండగా ఉండటాన్ని ప్రభుత్వం తప్పుబడుతుందా అని ప్రశ్నించారు. దీక్షను రాజకీయ కోణంలో చూడటం సరికాదన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే ప్రతి ఒక్కరి గొంతు నొక్కడమే కూటమి ప్రభుత్వం పనిగా పెట్టుకున్నట్లు కనిపిస్తుందన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి



నర్రావారిపాలెం(కర్లపాలెం): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి మోటార్లకు విద్యుత్ సరఫరా చేయాలని అంటరానితన నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక చెప్పారు. నర్రావారిపాలెం పంచాయతీ పరిధిలోని కట్టావాద గ్రామ సమీపంలో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్‌కు విద్యుత్ సరఫరా చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ అధికారులు ఇటీవల తొలగించటంతో వెద పెట్టిన వరి పైర్లు వాడిపోతున్న నేపథ్యంలో డాక్టర్ చార్వాక కట్టావాద రైతులతో మంగళవారం సమావేశమయ్యారు. స్వయంగా రైతుల సమస్యలు తెలుసుకున్న చార్వాక స్థానిక శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మరాజు స్పందించి విద్యుత్ అధికారులతో మాట్లాడి తిరిగి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. లిఫ్ట్ ఇరిగేషన్ పరిధిలో పేద దళిత రైతుల పొలాలు ఉన్నాయని అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జై భీమ్‌రావ్ పార్టీ నాయకుడు పర్రె కోటయ్య, వినయ్‌రాజు, రైతులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



కర్లపాలెం: ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్న ఘటన మండలంలోని పెదగొల్లపాలెం గ్రామంలో ఉన్న బ్రాందీ షాపు వద్ద చోటు చేసుకుంది. కర్లపాలెం ఎస్ఐ జి.రవీంద్ర తెలిపిన వివరాల మేరకు పేరలి గ్రామానికి చెందిన దేవరంపాటి చంటిబాబు(35) పెదగొల్లపాలెం గ్రామంలోని బ్రాందీ షాపు వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నట్లు అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించినట్లు తెలిపారు. చంటిబాబు సోమవారం రాత్రి బ్రాందీషాపు వద్ద మద్యం కొనుగోలు చేసి తాగుతూ ఉన్నాడని షాపు మూసివేసి సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లారని ఎస్ఐ తెలిపారు. మంగళవారం ఉదయం చంటిబాబు మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గమనించి తమకు ఫిర్యాదు చేశారని తెలిపారు. మృతుడి తండ్రి యోహాను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

బాలబాలికల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

ఎస్ఐ బాబూరావు



నిజాంపట్నం: బాలబాలికల సంరక్షణకై ప్రత్యేక దృష్టి సారించినట్లు అడవులదీవి ఎస్ఐ బాబూరావు తెలిపారు. గుడ్ టచ్–బ్యాడ్ టచ్ అంశంపై మండలంలోని అడవులదీవి, కొత్తపాలెం గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం విద్యార్థినులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాలికలు తమతో ఎవరైనా ప్రవర్తించే తీరుపట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎదుటి వారు తమని తాకే పద్ధతి ఏ మాత్రం ఇబ్బంది కలిగించేలా ఉన్నా తల్లిదండ్రులకు గానీ, ఉపాధ్యాయులకు గానీ తెలియజేయాలన్నారు. అపరిచిత వ్యక్తులు, నూతన వ్యక్తులకు దూరంగా ఉండాలన్నారు. బాలికలు, మహిళల పరిరక్షణకై ప్రభుత్వం చేసిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ఆత్మరక్షణ విద్యలను సైతం అభ్యసించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని తమ అభివృద్ధికి వినియోగించుకోవాలని, దుర్వినియోగానికి ఉపయోగించరాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ ఎప్పుడు ఇస్తారు సారు...?

- వెబ్‌సైటు తెరుచుకోవాలంటున్న అధికారులు
- సచివాలయాల చుట్టూ అర్హుల ప్రదక్షిణలు
- నియోజకవర్గంలో 2000 మందికి పైగా ఎదురుచూపులు

బాపట్ల అర్బన్: తాము అధికారంలోకి వస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్లకే సామాజిక పింఛన్లు ఇస్తామని చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు.ఆయనకు తోడుగా కూటమి పార్టీల నాయకులు ఇంటింటికి వెళ్లి 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామంటూ ప్రజలను నమ్మించారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటినా ఇప్పటివరకు ఒక్కటి కూడా కొత్త పింఛన్ మంజూరు చేయలేదు. ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పడం లేదు. కనీసం దరఖాస్తు ప్రక్రియ కూడా చేపట్టలేదు. దీంతో చంద్రబాబు మాటలు నమ్మి మరోసారి మోసపోయామని పింఛన్‌కు అర్హులైన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేది లేక పింఛన్ ఎప్పుడు ఇస్తారు సారు... అంటూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం వెబ్‌సైట్ తెరుచుకుంటే గానీ చెప్పలేం అని అధికారులు కసురుకుంటున్నారు.



ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటింది. ఇచ్చిన హామీలేవి నెరవేర్చకుండా అన్ని వర్గాల వారిని మోసం చేసింది ఒక్కటంటే ఒక్క కొత్త పింఛన్ మంజూరు చేయలేదు . పైగా ఉన్న వాటిలోనూ కోత విధించే పనిలో ఉంది. దీంతో అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

2000 మందికి పైగా అర్హులు

బాపట్ల నియోజకవర్గంలో బాపట్ల పట్టణం, బాపట్ల, కర్లపాలెం, పిట్లలవానిపాలెం మండలాల్లో దాదాపు 2000 మందికి పైగా అర్హులైన వారు కొత్త పింఛన్ కోసం ఎదురుచూస్తున్నారు. కొందరు టీడీపీ నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. అయితే దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని అధికారులు సమాధానం ఇస్తున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏడాదంతా పింఛన్ దరఖాస్తు వెబ్‌సైట్ అందుబాటులో ఉండేది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకుండా దరఖాస్తులను స్వీకరించలేమని అధికారులు లబ్ధిదారులకు చెప్పి పంపిస్తున్నారు.

వితంతు పింఛన్లకు మంగళం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన వారు దరఖాస్తు చేసుకున్న రోజుల వ్యవధిలోనే పింఛన్ మంజూరు చేసేవారు. భర్త చనిపోతే డెత్ సర్టిఫికెటు సచివాలయంలో అందజేస్తే పింఛన్ మంజూరు చేసేవారు. కూటమి ప్రభుత్వంలో నూతన పింఛన్లు మంజూరు చేయకపోగా స్పౌజ్ పింఛన్లకు మంగళం పాడింది. వితంతు పింఛన్ల కింద పలువురు దరఖాస్తు చేసుకున్న మంజూరుకు నోచుకోలేదు. దీంతో కొత్త పింఛన్లు ఎప్పుడు వస్తాయా అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి స్పౌజ్ పింఛన్లను ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

దరఖాస్తులు స్వీకరించలేదు



50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని చెప్పడంతో నమ్మాం. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కొత్త పింఛన్లకు దరఖాస్తులను కూడా స్వీకరించలేదు. పలుమార్లు సచివాలయాలు సిబ్బందిని అడిగిన ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాలేదని సమాధానం ఇస్తున్నారు.

– గోళ్ళమూడి ఆదిశేషు, మర్రిపూడి

ప్రభుత్వం ఆదుకోవాలి

నా భర్త ఏడాది క్రితం అనారోగ్యంతో మతి చెందాడు. ఆసరా కోల్పోయిన నాకు కనీసం వితంతు పింఛను కూడా మంజూరు చేయలేదు. అనారోగ్య సమస్యలు, గృహ అవసరాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాను. ప్రభుత్వం నాలాంటి వారిని ఆదుకోవాలి.

– అన్నపూర్ణమ్మ, బాపట్ల

వెబ్‌సైట్ ఓపెన్‌లో లేదు



పింఛన్లకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు. కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి. పాత పింఛన్ల పరిశీలన పూర్తయిన తర్వాతే కొత్త వాటికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన తర్వాత దరఖాస్తులను స్వీకరిస్తాం.

– బి.బాబురావు ఎంపీడీవో, బాపట్ల మండలం

చంద్రబాబు మోసాలను ప్రజలు తెలుసుకోవాలి

మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

చందోలు(కర్లపాలెం): సీఎం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నాడని ఈ విషయం ప్రజలు తెలుసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త కోన రఘుపతి చెప్పారు. వైఎస్సార్‌సీపీ పిట్టలవానిపాలెం మండల అధ్యక్షుడు ఊయ్యూరి లీలాశ్రీనివాసరెడ్డి అధ్యక్షతన మంగళవారం సాయంత్రం చందోలు గ్రామంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోన రఘుపతి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు ఉచితంగా బస్సు ఎక్కి ఎక్కడికైనా వెళ్లొచ్చని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పుడు జిల్లా వరకే పరిమితం చేయటం మహిళలను మోసం చేయటం కాదా అని నిలదీశారు. సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పిన చంద్రబాబు అధికారం చేపట్టి సంవత్సర కాలమైనా అర్హులకు మూడు సిలిండర్లు ఇవ్వలేదని అన్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను బాబు మోసం చేశాడని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎస్కే బాజీ, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు అహ్మద్ హుస్సేన్, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు మండే విజయ్‌కుమార్, వీరయ్య, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు ఎస్కే మౌలాలీ, రాష్ట్ర కార్యదర్శి కొక్కిగడ్డ చెంచయ్య, చందోలు గ్రామ పార్టీ అధ్యక్షుడు అమీర్‌ఖాన్, నాయకులు దొంతిరెడ్డి కోటిరెడ్డి, బడుగు ప్రకాష్, దోమ వెంకటేశ్వర రెడ్డి, పాణ్యం శ్రీనివాసరావు, ప్రభాకర్‌రెడ్డి, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

డెంగీ నివారణపై అవగాహన సదస్సు



వేమూరు: నిల్వ ఉన్న నీటిలో దోమలు ఉత్పత్తి అవడం ద్వారా మలేరియా, డెంగీ, చికెన్ గునియా, మెదడ వాపు వంటి వ్యాధులు వ్యాపించడం జరుగుతుందని తెనాలి పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి కంఠ ఉమాకాంత్ చెప్పారు. వేమూరు మండలంలోని జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డెంగీ నివారణపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమాకాంత్ మాట్లాడుతూ ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. దోమలు గుడ్లు పెట్టిన దగ్గర నుంచి పెద్ద దోమలుగా మారటానికి 8 నుంచి 10 రోజుల సమయం పడుతుందన్నారు. ప్రజలు వారానికి కనీసం ఒక్క సారైనా నీటి నిల్వలను మార్చుకొనుట ద్వారా దోమల ఉత్పత్తి తగ్గించుకోవచ్చని ఆయన చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బద్రినారాయణ, పెరవలి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకురాలు శోభారాణి, విలేజ్ హెల్త్ సెక్రటరీ మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్ మృతి పార్టీకి తీరనిలోటు

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్

రేపల్లె: కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ మృతి భారత కమ్యూనిస్టు పార్టీకి తీరనిలోటని సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. సీపీఎం అగ్రనేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ మృతి చెందటంతో పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. ఎనిమిది దశాబ్దాల పాటు రాజకీయాలలో ఉండి రాష్ట్రాభివృద్ధి తన అమూల్యమైన సేవలను అందించారన్నారు. ఏడుసార్లు శాసనసభ్యునిగా, కేరళ ముఖ్యమంత్రిగా ప్రజాభిమానాన్ని చూరగొన్నారని తెలిపారు. కమ్యూనిస్ట్ పార్టీ నిర్వహించే పోరాటాలలో కీలక పాత్ర పోషించారన్నారు. నేటి యువత, రాజకీయ నాయకులకు ఆయన సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కేవీ లక్ష్మణరావు, వై.కిషోర్, కె.ఆశీర్వాదం, వై.నవీన్, కె.రమేష్, డానియేలు, రామకృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాకవి దాశరథి సేవలు నిరుపమానం

తెనాలిటౌన్: ప్రజాకవి దాశరథి కృష్ణామాచార్యులు కలం నుంచి, గలం నుంచి బయటపడ్డ ప్రతి అక్షరం జనంలో చైతన్యం నిలిపిందని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి రాష్ట్ర నాయకులు ఎ.రామారావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో దాశరథి కృష్ణామాచార్యులు 100వ జయంతి ఘనంగా నిర్వహించారు. అభ్యుదయ కళాసమితి, ప్రజా నాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి సమాజానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నా రు. కార్యక్రమంలో తాడికొండ జగన్మోహనరావు, శ్రీదేవి, ఎంవీ.రఘునాథ రావు, నాగం రమేష్, కె. విజయ సారథిబాబు, వి.భువనేశ్వర ప్రసాద్, బెజ్జంకి నాగమణి, విజయలక్ష్మి, విజయదుర్గా, బొల్లిముంత కృష్ణ పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే పీ 4 లక్ష్యం

తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు

రేపల్లె: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా స్వర్ణాంధ్ర 2047 దార్శనిక కార్యక్రమం కిందప్రభుత్వం ప్రవేశపెట్టిన జీరో పావర్టీ–పీ 4 కార్యక్రమాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. జీరో పావర్టీ–పీ 4 కార్యక్రమంలో భాగంగా మండలంలోని అరవపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభ సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభాలో అత్యంత సంపన్నులైన 10 శాతం మంది పేద కుటుంబాలలో దిగువనున్న 20 శాతం మంది పేదలకు మద్దతు ఇవ్వడానికి ప్రోత్సహించటం ద్వారా సామాజిక ఆర్థిక అంతరాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ కార్యక్రమం రూపుదిద్దుకుందన్నారు. పీ4 ప్రభుత్వ–ప్రైవేటు ప్రజల భాగస్వామ్యాన్ని సూచిస్తుందన్నారు. దీనిలో విరాళమివ్వడానికి సిద్ధంగా ఉన్న సంపన్న వ్యక్తులను మార్గదర్శకులు అంటారని, నిరుపేద లబ్ధిదారులను బంగారు కుటుంబంగా గుర్తిస్తారని చెప్పారు. అరవపల్లి గ్రామంలో 18 బంగారు కుటుంబాలను, 3 మార్గదర్శి కుటుంబాలను ఎంపిక చేయటం జరిగిందని తెలిపారు. మార్గదర్శి కుటుంబాలు చూపే బాటలో బంగారు కుటుంబాలు అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీ4పై పంచాయతీ కార్యదర్శులతో సమావేశం

చుండూరు(వేమూరు): దత్తత తీసుకున్న కుటుంబాలకు విద్య, వైద్యం, తాగునీరు, ఇల్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి ఎన్.సుదీప అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పీ 4 కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీ 4 గ్రామాలకు ప్రభుత్వ సహకారంతో మౌలిక సదుపాయాలు కల్పించుటకు మార్గదర్శకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో టి.ఉషారాణి, పరిపాలన అధికారి డి.సుధారాణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల ఎంపికలో అవకతవకలు

పెరవలి(వేమూరు): పీ 4 ద్వారా ఎంపికైన కుటుంబాలను తీర్చిదిద్దడం జరుగుతుందని మండల ప్రత్యేకాధికారి నాగిరెడ్డి తెలిపారు. మండలంలోని పెరవలి గ్రామంలో పీ 4పై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మండల స్థాయిలో వివిధ గ్రామాల్లో పీ 4 బంగారు కుటుంబాలను ఎంపిక చేయడం జరిగిందని, ఆ కుటుంబాలను దత్తత తీసుకొని విద్య, వైద్యం, తాగునీరు, ఇళ్లు, వంటి మౌలిక సదుపాయాలు కల్పించుటకు మార్గదర్శకులు కృషి చేయాలని ఆయన కోరారు. పెరవలిలో బంగారు కుటుంబాలు ఎంపిక పట్ల అవకతవకలు ఏర్పడ్డాయని, మరలా ఎంపిక చేయాలని ఆయన అధికారులపై సీరియస్ అయ్యారు. అధికారులు బంగారు కుటుంబాలు ఎంపికపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పి.రవికుమార్, తహసీల్దారు సుశీల, చొప్పర శేఖర్, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎంపీడీవో ఎన్.సుదీప



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నాగిరెడ్డి

మండల ప్రత్యేకాధికారిగా నాగిరెడ్డి

వేమూరు: పీ 4 కార్యక్రమం విజయవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ వెంకట మురళి మండల ప్రత్యేకాధికారిగా తనను నియమించడం జరిగిందని నాగిరెడ్డి తెలిపారు. ప్రత్యేకాధికారిగా బాధ్యతలు మంగళవారం చేపట్టడం జరిగిందన్నారు.

బంగారు కుటుంబాల అభివృద్ధికి కృషి చేయాలి

ఆర్డీవో గ్లోరియా

కర్లపాలెం: బంగారు కుటుంబాల అభివృద్ధికి కృషి చేయాలని బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా చెప్పారు. మండల పరిధిలోని నల్లమోతువారిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం సాయంత్రం పి–4పై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో గ్లోరియా మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన పి–4 కార్యక్రమంలో భాగంగా నల్లమోతువారిపాలెంలో మొత్తం 57 బంగారు కుటుంబాలను గుర్తించటం జరిగిందన్నారు. ఈ కుటుంబాల అభ్యున్నతికి 8 మంది మార్గదర్శకులను నియమించారని ఆమె తెలిపారు.

డీపీవో కె.ప్రభాకర్ మాట్లాడుతూ పేద కుటుంబాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం బంగారు కుటుంబాలను గుర్తించినట్లు చెప్పారు. మార్గదర్శకులుగా నియమించబడిన వ్యక్తులు బంగారు కుటుంబాలను అభివృద్ధి చేసేందుకు సహాయ సహకారాలందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, ఎంఈవో విజయశ్రీ, ఈవోపీఆర్డీ ఐ.శ్రీనివాసరావు, డీటీ శ్రీదేవి, కార్యదర్శి షమీనాబేగం , మార్గదర్శకులు మాడా శ్రీనివాసరావు, బేసాబత్తుని ఆంజనేయులు తదితరులు ఉన్నారు.



నల్లమోతువారిపాలెం సభలో మాట్లాడుతున్న ఆర్డీవో గ్లోరియా

సంపద సృష్టి చేత కాదు.. రాష్ట్రాలు అమ్మేయడంలో ప్రథమం

వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు



వేమూరు: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సంపద సృష్టించడం చేత కాదు కాని రాష్ట్రాలు అమ్మేయడంలో ప్రథమ స్థానంలో ఉంటాడని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆడబిడ్డ నిధిపై చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు సూపర్ సిక్స్ పథకాల్లో ఆడబిడ్డ నిధి ఉందిగా ఆ రోజు రాష్ట్రం అమ్మేయాలని తెలియకుండా వాగ్దానం చేశారా అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రజలు వద్దకు తీసుకెళ్లారు. ఆడబిడ్డ నిధి వేయకుండా మహిళలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు.

రాజకీయ వివక్ష లేకుండా అధికారులు పనిచేయాలి

ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య

నగరం: రాజకీయ వివక్ష చూపకుండా అధికారులు ఎంపీటీసీ, సర్పంచ్‌లకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. అధికారులు రాజకీయ పార్టీలకు అతీతంగా పని చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ పంచాయతీలలో బిల్లులు పెట్టకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా పని చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. అద్దంకివారిపాలెం ఎంపీటీసీ సభ్యులు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లుక్కా బాపనయ్య అధికారులు తమకు ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదని అన్నారు. ఉపాధి హామీ పనులకు టీడీపీ నాయకులు సిఫారస్ చేయాలని అధికారులు చెప్పడం ఏంటని ప్రశ్నించారు. మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో టీడీపీ నాయకులు నిధుల దుర్వినియోగం చేస్తున్నారని, ఇష్టానుసారంగా బిల్లులు మార్చుకుంటున్నారని దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు బాపనయ్య సమావేశంలో తెలిపారు. సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరవ్వడం పట్ల ఎంపీపీ శ్రీకృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బొర్రా శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీకృష్ణయ్య

వైఎస్సార్‌సీపీ కోసం అంకితభావంతో కృషి చేద్దాం

రాష్ట్ర కార్యదర్శి చేజర్ల

బాపట్ల: వైఎస్సార్‌సీపీ కోసం అంకిత భావంతో అందరం కలిసి పని చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పార్టీలో కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్త, నాయకుడికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు కష్టపడి పని చేద్దామని అన్నారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతికి తనకు పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండలురెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, జోగి రాజా, ఇమ్మడిశెట్టి శ్రీను, మోర్ల సముద్రాలగౌడ్, మచ్చ శ్రీనివాసరెడ్డి, కోకి అంకిరెడ్డి, బుల్లిరెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి

సస్యరక్షణతో అధిక దిగుబడులు

ఏడీఏ లక్ష్మి

రేపల్లె: సస్యరక్షణ పద్ధతులు అవలంభించి అధిక దిగుబడులు సాధించవచ్చని రేపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు అద్దేపల్లి లక్ష్మి చెప్పారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని కైతేపల్లి, పోటుమెరక గ్రామాల్లో మంగళవారం రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సాగు సమయంలో రైతులు భూసార పరీక్షలు చేయించుకోవటంతో పాటు నాణ్యమైన విత్తనాలు, నారుమళ్ళ యాజమాన్యం, పచ్చిరొట్ట ఎరువులు, కలుపు నివారణ, ఎలుకల నివారణ పద్ధతులు తదితర అంశాలపై అవగాహన ఉండాలన్నారు. కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డుల ఆవశ్యతను వివరించారు. కార్యక్రమంలో ఏవో మహేష్‌బాబు, వీఆర్వో రాంబాబు, ఏఈవో సుమంత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

